# సింగిల్ పేజీ కథలు

## విలువ

రేవంత్‌కి రాత్రేకాదు పగటి కలలూ ఎక్కువే. బెడ్‌మీద పడుకున్నంత సేపు ఏదో అసంతృప్తి. ఏదో తక్కువవుతుందన్న ఆందోళన. ఉదయం టిఫిన్‌కి అలవాటు పడితే ఎక్కువ ఖర్చవుతుందని టీతో సరిపెట్టుకుంటాడు. మెస్ బిల్ పెరుగుతుందని ఒక మీల్స్ పార్శిల్ తెచ్చి మధ్యాహ్నం సాయంత్రం నెట్టేస్తాడు. బస్ ఛార్జీల పనిలేకుండా పనిచేసే కంపెనీ దగ్గరే రూమ్ తీసుకున్నాడు.

అతనో డబ్బు పేషెంట్. స్నేహితులతో వెళ్ళినప్పుడు తక్కువ టైంలో తీయటానికి వీలుంటుందని డబ్బులెప్పుడూ పైజేబులో పెట్టడు. ఎక్కువ మడతలుండే పర్స్ ఉపయోగిస్తాడు. ఈ కాలంలో సహనం ఎవరికుంటుంది. అతడు మడతలు విప్పేలోపు ఎవరో ఒకరు బిల్లిచ్చేసేవారు. రేవంత్‌కి ఆశకంటే దురాశే ఎక్కువ. రెండు లక్షలు కట్నం వస్తుందని ఓరోజున ఇంటి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. రేవంత్ వెనుకా ముందూ ఆలోచించలేదు.

అమ్మాయి ముఖం మీదకంటే కట్నం ప్లేటు మీదనే ఎక్కువ దృష్టిసారించాడు. వంటసామాన్లు, ఇంటిసామాన్లు మామగారి చేత దగ్గరుండి కొనిపించాడు.

సిటీలో ముందుండే రూమ్‌లోనే కాపురం ఎడ్జెస్ట్ చేశాడు. బ్యాచిలర్‌గా వున్నంత కాలం అయితే పేపర్ బిల్లు, కేబుల్ బిల్లు, ఇతరత్రా మెయింటెనెన్స్ ఒక నెల ఇచ్చి మరో నెల కనెక్షన్స్ తీసేసో లేదా ఒకటో తేదీకి ఏ ఫ్రెండ్ రూమ్‌లోనో ముఖం దాచి కాలం వెళ్ళదీసేవాడు. ఇప్పుడలా కాదు. ఠంచనుగా ఇంటికి రావాలి. అన్ని బిల్లులూ కట్టాలి. నెలనెలా జీతానికి ఇంటి ఖర్చులతో చిల్లుపడుతుంటే కొత్తగా వచ్చిన రెండు లక్షల వల్ల ఒరిగిందేమిటి? ఆలోచన్లు చేసి చూశాడు. వడ్డీలు కట్టి చూశాడు. ఎందుకు సంసారం? అనుకుని రాత్రిళ్ళు లేటుగా రావడం మొదలుపెట్టాడు. పెళ్ళయిన కొత్తల్లో ముద్దు అనిపించిన భార్యే ఇప్పుడు మొద్దు అవతారం ఎత్తింది. చీటికి మాటికి తిట్టడం మొదలైంది.

ఈమధ్య ఇంకో రకం ఫోబియా అతడ్ని వేధిస్తోంది. పక్కవాటాలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్తులే. చెరో నాలుగు వేలు జీతం. అవీ లెక్కలు కట్టి చూశాడు. ఒకేసారి రెండు లక్షలూ డిపాజిట్ కంటే, లాంగ్ పేమెంట్స్‌లో సుఖం గోచరించింది. తను అలాంటి భార్యను చేసుకున్నట్లయితే ఎంత బావుండేది అనుకున్నాడు.

కనీసం పదో తరగతయినా పూర్తిచెయ్యని భార్యమీద మండిపడ్డాడు. మొద్దు అవతారం కాస్తా బ్రహ్మరాక్షసి అయి కూర్చుంది. ఎప్పుడైనా పుట్టింటికెళ్ళిందంటే హాయి. ఏదైనా వస్తువుతోనో, ఖరీదుగానో వచ్చిందంటే మరింత హాయి. ఇలా సాగుతూ సాగుతూ వుండగా ఒకరోజు... వైజాగ్‌లో వున్న తన కజిన్ శశికాంత్ నుంచి ఒక్కసారి వచ్చెళ్ళమని కబురొచ్చింది.



★ ★ ★

ఖరీదైన బంగ్లా..
గేటు దగ్గర గూర్ఖా..
రెండు ఆల్సేషన్ కుక్కలు..
పోర్టికోలో ఐకాన్ కారు..
ఇంట్లో వస్తువులైతే ఓహ్..

పిఎఫ్‌లు, ఇంక్రిమెంట్‌లు, లైఫ్ లాంగ్ జీతం ఒక్కసారిగా పొందినా తనింత స్వర్గం నిర్మించలేడు. సుఖం అంటే అన్నయ్యదే. నిజమైన లక్ష్మీదేవంటే నెలకు ముప్పై వేలకి పైగా సంపాదించే అన్నయ్య భార్యే.

తన భార్య గుర్తొచ్చి ముఖం చిన్నబుచ్చుకున్నాడు. బంగ్లాలోకి అడుగుపెట్టాడు. అంత బంగ్లాలో హాలు మధ్యలో ఖరీదైన ఏ కుషన్ ఛెయిర్‌లోనో గంభీరంగా కూర్చునుంటాడనుకున్న అన్నయ్య పరిస్థితి అలా లేదు. ఎక్కడో మారుమూల గదిలో జబ్బుతో పడివున్నాడు.

ఇంటినిండా పనిమనుషులు ఇంతమంది వందిమాగధులున్న ఇంట్లో అన్నయ్య ఒక్కడే అలా పడివుండటం రేవంత్‌కి నచ్చలేదు. అన్నయ్య తన చెయ్యి వదల్లేదు. ఎందుకు వదల్లేదంటే కారణం వుంది.

జబ్బుపడ్డ మనిషికి అయినవాళ్ళ ఆదరణ ఒక టానిక్‌కన్నా బలమైందట. ఈ రెండు మూడు రోజుల్లో తను గ్రహించిందేమిటంటే వదినకెప్పుడూ డబ్బు దాహం. ఇరవై నాలుగ్గంటలూ బిజీ బిజీ. ఒక కప్పు కాఫీ ఇవ్వటం కాదు, కనీసం భర్త ఏ స్థితిలో వున్నాడన్న ధ్యాస కూడా వుండదు. ఒక్కోసారి ఆ గదివైపు కూడా రాదు.

రేవంత్‌కి ఆ క్షణంలో తన భార్య గుర్తొచ్చింది. అర్ధరాత్రి వచ్చినా నిద్రలేచి కొసరి కొసరి అన్నం వడ్డించే ఇల్లాలు.. క్షణం తలమీద చెయ్యేసుకుంటే ఏ అనారోగ్యమోనని అల్లం టీతో ప్రత్యక్షమయ్యే ఇలవేల్పు..

చేతికి గాయం అయిందంటే ఆమె కన్నీటి వైద్యం ముందు హైడ్రోజన్ పెరాక్సైడు బలాదూరే కదా! తనింత కాలం ఏం పోగొట్టుకున్నాడో తెలిసొచ్చింది. తపన.. ఆరాటం.. ఉరుకులు... పరుగులు వుండాలి కాని అనుక్షణం అవి మానసిక అశాంతిని కలిగించేవి కాకూడదు.

ఈ కాలంలో డబ్బు సంపాదించే వారికంటే మనసున్న ఇల్లాలిని పొందిన వారే అదృష్టవంతులు. వీలైనంత త్వరగా వెళ్ళి భార్యని చూడాలన్నది అతడి ఆరాటం.

**-పావులూరి శివాజీ** (తుర్లపాడు)